క్లుప్తంగా

10న బసవేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవం



బసవేశ్వర ఆలయం

శిరివెళ్ల: ఈ నెల 10వ తేదీన స్థానిక శ్రీ బసవేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. అతి పురాతన ఆలయాన్ని గతేడాడి దాతల విరాళాలతో జీర్ణోద్ధరణ గావించారు. ఆలయంలో శ్రీ వరసిద్ధి వినాయక, అన్నపూర్ణా విశాలక్ష్మి, శ్రీ సమేత కాశీ విశ్వేర, బసవేశ్వర, కుమార, వీరభద్ర, కాలభైరవ, నవగ్రహ, నాగ ధ్వజ ప్రతిష్టతలు చేపట్టి ఏడాడి పూర్తి కావడంతో ఆలయ నిర్వాహకులు వార్షికోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రథమ వార్షికోత్సవం రోజున విగ్రహాలకు విశేష పూజలు, శ్రీ శివ పార్వతీ కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



చిత్రేనిపల్లె గ్రామ సచివాలయంలో విచారణ చేస్తున్న ఏపీడీ

రుద్రవరం: మండల పరిధిలోని చిత్రేనిపల్లె పంచాయతీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సుందర్‌పై గురువారం ఏపీడీ సాంశివరావు విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నాడని కొందరు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే ఫిర్యాదు దారులతో పాటు మరి కొందరిని విచారించిన అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ తీసుకున్నామని చెప్పారు. వివరాలను ఉన్నాతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రతాప్ టెక్నికల్ అసిస్టెంట్ సుబ్బన్న, పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ తదితరులు ఉన్నారు.

హామీలను నెరవేర్చాలి

నంద్యాల (న్యూటౌన్): చేతి వృత్తిదారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని స్వామిరెడ్డి భవన్‌లో చేతివృత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రజకులు, గొర్రెల ,మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు. విశ్వకర్మ యోజన పథకం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలగడం లేదన్నారు. సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు శివ నాగయ్య ,సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు,సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్,ఏపీ గొర్ల,మేకల పెంపకందారుల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు యాదవ్, వెంకటశివుడు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు కర్నూలులో జరిగే ఉమ్మడి జిల్లా సీనియర్ సూపర్‌లీగ్ ఫుట్‌బాల్ పోటీలకు నంద్యాల జిల్లాకు చెందిన 13 మంది క్రీడాకారులు ఎంపికై నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్‌సాగర్, కార్యదర్శి అనిల్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతనెల 26న జరిగిన పోటీల్లో నంద్యాల జిల్లా జట్టును ఎంపిక చేశారని పేర్కొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు పాఠశాల సహాయకుడిగా పనిచేసిన రాజునాయక్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతేదాది జూలై 30న పాఠశాల విద్యార్థినిని దూషించారని విద్యాశాఖధికారులు సస్పెండ్ చేశారన్నారు. ఉమ్మడి జిల్లానోడల్ అధికారి శ్యాముల్ పాల్ గత సంవత్సరం నవంబరు 23న పునర్నియామకం చేస్తూ ఉత్తర్వులను డీఈవోకు పంపారని, ఇప్పటి వరకు ఉత్తర్వులు అమలు చేయకపోవడం సరికాదన్నారు. పుల్లయ్య,మానపాటి రవి,శిరివెళ్ల కార్యదర్శి నగిరి వెంకటేశ్వర్లు, మునిస్వామి పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

శిరివెళ్ల: తెలంగాణాలోని కొల్లాపూర్‌కు చెందిన వ్యక్తి కలమంద నవీన్‌కుమార్ (30) నంద్యాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. నవీన్‌కుమార్ ఈ నెల 5వ తేదీన చాగలమర్రి మండలం మల్లేవేములలో ఉన్న తన భార్యను చూడడానికి మోటార్ బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తుండగా నంద్యాల-ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై ఓ లారీ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికికు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శాంతి రాం ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కాగా వ్యక్తి ఎల్.ఎన్.టీ కంపెనీలో ల్యాబ్ టెక్నిషీయన్‌గా పని చేస్తున్నాడు. ఒక కూతురు ఉంది. భార్య సుధా లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపారు.

- సెలవులో దొర్నిపాడు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ
- ఏకకాలంలో 9మంది సిబ్బంది బదిలీ
- వారి స్థానంలో ఐదుగురు మాత్రమే నియామకం
- అందులో విధుల్లో చేరింది ముగ్గురే

ఠాణా ఖాళీ



దొర్నిపాడు: ఇటీవల జరిగిన బదిలీల్లో దొర్నిపాడు పోలీస్ స్టేషన్ ఖాళీ అయ్యింది. దీంతో పోలీసులు లేక ఠాణా వెలవెలబోతోంది. తొమ్మిదిమంది ఏకకాలంలో బదిలీకాగా.. వారి స్థానంలో ముగ్గురు మాత్రమే ఇక్కడికి బదిలీపై వచ్చారు. అందులోనూ ఒకరు రోడ్డుప్రమాదంలో గాయపడి సిక్‌లో ఉండగా.. మరొకరు సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం స్టేషన్‌లో నలుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో భారమంతా వారిపైనే పడుతోంది.

బదిలీలతో స్టేషన్ ఖాళీ..

పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇద్దరు ఏఎస్‌ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు మొత్తం 9 మంది ఏక కాలంలో బదిలీపై వెళ్లారు. కానీ వారి స్థానంలో ఐదుగురు కానిస్టేబుళ్లను మాత్రమే పోలీస్ స్టేషన్‌కు నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిలో సునీల్, చిన్నబాబు, గంగాధర్ జాయిన్ అయ్యారు. బనగానపల్లి, కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్ల నుంచి కుమార్, మదన్‌గోపాల్ ఇంకా విధుల్లో చేరలేదు. ఇటీవల అహోబిలం బ్రహ్మోత్సవాలకు వెళ్లి తిరిగి వస్తూ చిన్నబాబు అనే కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. గంగాధర్ అనే కానిస్టేబుల్ ఒక్క రోజే విధులు నిర్వహించి మరుసటి రోజే సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. అంటే ప్రస్తుతం ఏఎస్‌ఐ రంగయ్య, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, కోర్టు కానిస్టేబుల్ పీరా, కానిస్టేబుల్ సునీల్ మాత్రమే ఉన్నారు.

సెలవులో ఎస్‌ఐ వెంకటేష్

గతేడాది ఆగస్టులో ఎస్‌ఐగా వెంకటేష్ విధుల్లో చేరారు. ఈయన విధుల్లో చేరినప్పటి నుంచి పట్టుమంటే పదిరోజులు కూడా సరిగ్గా కుర్చీలో కూర్చున్న దాఖలాలు లేవు. ఎప్పుడూ బందోబస్తుల పేరిట వేరేప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన మెడికల్ లీవ్‌లో ఉన్నారు. సెలవుల అనంతరం విధులు చేరుతారా లేదా అనే సందేహాలు ఉన్నాయి. గతంలో రూరల్ సర్కిల్లో పనిచేసిన ఓ ఎస్‌ఐ దొర్నిపాడుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆపరేటర్ లేక ఇబ్బందులు

ప్రస్తుతం ఒక ఏఎస్‌ఐ, ఒక హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వారిలో ఒకరు కోర్టు కేసులను చూసుకునేందుకే సరిపోతుంది. ఉన్న ఆపరేటర్ అమీర్ బదిలీపై వెళ్లడంతో కేసులను ఎఫ్ఐఆర్ ఆన్‌లైన్ చేసేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరు ముగ్గురితో కలిసి విధులు నిర్వహించాలంటే సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు. నలుగురితో సతమతం అవుతున్న దొర్నిపాడు పోలీస్ స్టేషన్‌పై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు



ప్రతిభ చూపిన విద్యార్థులు

నంద్యాల (న్యూటౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, వివిధ రకాల స్పోర్ట్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ పాఠశాల క్రీడాకారులు పాల్గొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచారని గురురాజా పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి గురువారం తెలిపారు. ఆయా పోటీల్లో పాల్గొన్న సుమారు 45 మంది క్రీడాకారులు విజేతలుగా నిలిచారన్నారు. అండర్-14 అండర్ -17 అండర్ బాల బాలికల విభాగాల్లో నిర్వహించిన త్రో బాల్, ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఫెన్సింగ్, చెస్ పోటీల్లో క్రీడాకారులు రాణించారని చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు స్పందన, రాజేశ్వరి, నర్మద, వర్షిత జంప్ రోప్ పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థినులను గురువారం పాఠశాలలో ప్రిన్సిపాల్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3, 4తేదీల్లో వైఎస్సార్ జిల్లా మైదుకూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో ఆ నలుగురు విద్యార్థినులు ప్రతిభ కనపరచి గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 11న మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని పీడీ శ్రీనివాసులు తెలిపారు.

వేద గ్రంథాల అందజేత



గ్రంథాలను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీ పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయానికి నాలుగు వేద గ్రంథాలను మూన్ ఆప్టికల్ షాపు అధినేత పి.ఉస్నూరు గురువారం అందజేశారు. ఉస్నూరు మాట్లాడుతూ దివ్యవేదవాణి గ్రంథాలను హైదరాబాద్‌కు చెందిన వాచస్పతి డాక్టర్ కృష్ణారెడ్డి అనువదించారన్నారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలు అందరికీ అర్థమయ్యే భాషలో అందుబాటులో ఉంచాలనే ఆలోచనతో తెలుగులోకి అనువదించిన గ్రంథాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని అందజేశామని చెప్పారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఆళ్లగడ్డ : కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను హరించే విధంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో కార్పొరేట్ కంపెనీల లాభాలు పెంచే విధంగా ఉందన్నారు. వ్యవసాయ అనుబంధ సంఘాలకు గత సంవత్సరం కంటే తక్కువగా నిధులు కేటాయించడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు శ్రీనివాసులు, శంకర్, రమేష్, లింగమయ్య, బాషా ఉన్నారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు



గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్‌ఎంపీ

పాములపాడు: మండలంలోని బానుముక్కల మలుపు సమీపంలో కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్ద కడబూరు మండలం, గట్టిగట్టు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, తమ్ముడి కుమారుడు నరసింహారెడ్డి గుంటూరుకు పని కోసం వలస వెళ్లారు. ఈ ఇద్దరు గురువారం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మండలంలోని యర్రగూడూరు గ్రామానికి చెందిన చింతల సుధీర్ ఆత్మకూరు వైపు వెళ్తుండగా బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రోడ్డుపై పడిన ముగ్గురు గాయాల పాలయ్యారు. అటుగా వెళ్తున్న ఆర్‌ఎంపీ మహ్మద్‌ఖాసిం క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. ఎస్‌ఐ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

నాలుగు వాహనాలు సీజ్

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రం సున్నిపెంటలో గురువారం సాయంత్రం టూటౌన్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అంబేడ్కర్ సెంటర్‌లో తనిఖీ చేపట్టి ఎటువంటి పత్రాలులేని నాలుగు వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ బీవీ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే త్రిబుల్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ చేస్తూ మొదటిసారిగా పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని, ఇకపై ఎవరైనా నిబంధనలు అతిక్రయించి పట్టుబడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని పొదుపు భవనంలో యాగంటి క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై ఆలయ ఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఈఓ, ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయా శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ డీఈఈ మద్దిలేటి, ఆర్టీసీ డీఎం రవికిశోర్, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి, పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండిమాలిశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎంఅండ్ఎం మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సోదాలు

బనగానపల్లె రూరల్: స్థానిక నంద్యాల రోడ్డులోని ఎంఅండ్ఎం మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఫుడ్ సేఫ్టీ, రెవెన్యూ అధికారులు సోదాలు నిర్వహించారు. పాలీస్ చేసిన పీడీఎస్ బియ్యంతో పాటు అనుమతులులేకుండా నిత్యావసర వస్తువులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారనే సమాచారంతో బుధవారం రాత్రి రెవెన్యూ అధికారులు సోదలు చేయగా గురువారం డిప్యూటీ సివిల్ సప్లయి అధికారి నాగేశ్వరరెడ్డి ఎంఅండ్ఎం మార్ట్ వద్దకు చేరుకుని లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యం ప్యాకెట్లతో పాటు కందిపప్పు, మినుపప్పు, వేరుశనగ పప్పు తదితర నిత్యావసర సరకుల ప్యాకెట్లను సీజ్ చేశారు. మధ్యాహ్నం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాసీంవలి, వెంకటరాముడలతోపాటు సివిల్ సప్లయి అధికారి నాగేశ్వరరెడ్డి మార్ట్ వద్దకు వచ్చి బియ్యం ఇతర వస్తువులను పరిశీలించి వాటి శాంపిల్స్ సేకరించారు. సివిల్ సప్లయి అధికారి నాగేశ్వరరెడ్డి మార్ట్ వారికి బియ్యం సరఫరా చేసిన రైస్ మిల్లు వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు.

మార్ట్ సుమారు 330 క్వింటాళ్ల బియ్యం, నాలుగు టన్నుల వేరుశనగ, 1.7 టన్నుల కందిపప్పు, 1.5 టన్నుల మినుపప్పు సరకులు ఉన్నట్లు సివిల్ సప్లయి డీటీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మార్ట్ కడప జిల్లా రాజంపేటకు చెందిన మునిరెడ్డి, నారాయణరెడ్డిలకు చెందినదిగా నిర్వాహకులు డీటీకి వివరించారు. ప్రభుత్వ అనుమతులు చూపించకపోవడంతో గొడౌన్‌లోని వస్తువులను సీజ్ చేసి రిపోర్టును జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందజేయనున్నట్లు సివిల్ సప్లయి డీటీ నాగేశ్వర రెడ్డి తెలిపారు.

'గుండెకు భరోసా' పోస్టర్ విడుదల

మిడుతూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెకు భరోసా పోస్టర్‌ను వైద్యాధికారి డాక్టర్ తిరుపతి గురువారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గుండెపోటు వస్తే తక్షణమే దగ్గర్లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ గుండెపోటును నివారించే టెనెక్టాప్లస్ అనే రూ.45 వేలు విలువగల ఇంజెక్షన్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ ఇంజెక్షన్ చేస్తే గుండెపోటు నుంచి తక్షణ ఉపశమనం కలుగుతుందని వివరించారు. ఎంపీడీఓ దశరాథరామయ్య, డాక్టర్లు భరత్, శారద, సాయిసుధ పాల్గొన్నారు.

పీఎంఏజీవైకి ఎంపికైన అబ్దుల్లాపురం

వెలుగోడు: మండల పరిధిలోని అబ్దులాపురం గ్రామ పంచాయతీ ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ్ యోజన పథకం కింద ఎంపికై ందని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఫేజ్ -2లో పీఎంఏజేవై కింద ఎంపిక కావడంతో ఎస్సీ కాలనీలలో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసేందుకు సర్వే చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అలాగే తాగునీరు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.20 లక్షలు ఖర్చు చేయనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

స్వచ్ఛతా కార్యక్రమం



పారిశుద్ధ్య పనులు చేస్తున్న దేవస్థాన సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాలలో ఆలయ అధికారులు, సిబ్బంది గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ముందుగా రథశాల నుంచి పెద్దసత్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రసాద విక్రయ కేంద్రం, ఆలయ మాడవీధులు, క్యూకాంప్లెక్స్, సాక్షి గణపతి ఆలయం, హఠకేశ్వరం, శిఖరేశ్వరం తదితర చోట్ల పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

జూదరుల అరెస్ట్

కోవెలకుంట్ల: రేవనూరులో పేకాట ఆడుతున్న 8 మందిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. గ్రామంలోని ఓ ఇంట్లో బనగానపల్లె, ఉయ్యాలవాడ, శిరివెళ్ల ప్రాంతాలకు చెందిన ఎనిమిది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. 37,550 నగదు, ఆరు బైక్‌లు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అందుబాటులో గుండెపోటు ఇంజెక్షన్లు

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గుండెపోటుకు సంబంధించి స్టెమి ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్టెమి కార్యక్రమంపై రోగులు, ప్రజలకు అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన వ్యక్తులకు ఉచితంగా రూ. 45 వేలు విలువ చేసే ఇంజెక్షన్లు వేయడం జరుగుతుందన్నారు. గుండెపోటు వచ్చే ముందు చాతిలో నొప్పి, ఎడమ చేయి లాగినట్లుగా ఉండడం, ఆయాసం, తదితర లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు కన్పిస్తే గంటలోపు ఆస్పత్రిలో చేర్చాలన్నారు.

దొంగ అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె: పట్టణంలోని కొండపేటలో చోరీకి పాల్పడిన ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన బుడత మనోహర్‌ను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. 2024 నవంబర్ 14వ తేదీ కొండపేటలో కె.కుమారి ఇంట్లో చోరీ చేశాడన్నారు. అతని వద్ద నుంచి రూ.1.70 లక్షల విలువైన మూడు తులాల బంగారం, 15 తులాల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇతడిపై బనగానపల్లె టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్ దొంగతనాల కేసు.. అవుకులో ఒక కేసు ఉన్నట్లు పేర్కొన్నారు.

సాయం సంధ్య సమయంలో గులాబీ వర్ణంలో మారిన ఆకాశం



అరుణుడు గీసిన చిత్రం

సాయం సమయాన ఆకాశ వీధిలో అరుణుడు గీసే చిత్రాలు మహాద్భుతంగా ఉంటాయి. అప్పుడప్పుడే అస్తమిస్తున్న భానుడి అరుణ కిరణాలతో ఒక్కసారిగా ఆకాశం లేత గులాబీ రంగులోకి మారి మనోరంజితమైన దృశ్యం దొర్నిపాడు సమీంలో గురువారం ఆవిష్కృతమైంది. పసిడి కాంతులు గగనాన్ని దాటి భువిపై ప్రసరించిన ఆహ్లాదకర దృశ్యంతో ప్రకృతి ప్రేమికులు పరవశించిపోయారు. - దొర్నిపాడు

కొలనుభారతి క్షేత్రంలో భీష్మ ఏకాదశి వేడుకలు



కొలనుభారతి దేవికి మంగళహారతి ఇస్తున్న శివయోగేంద్ర సరస్వతి

కొత్తపల్లి: సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతీ దేవి ఆలయంలో నిర్వహించే 66వ భీష్మ ఏకాదశిని విజయవంతం చేయాలని కాకనూరు శారదా పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి పిలుపునిచ్చారు. ఆయన గురువారం కొలనుభారతీ దేవి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన సరస్వతీదేవికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఏటా మాదిరిగానే ఈనెల 9, 10 తేదీల్లో కాకనూరు శారద పీఠం వ్యవస్థాపకుడు సద్గురు సరస్వతి నారాయణస్వామి ఆశీస్సులతో కొలనుభారతిదేవి ఆలయంలో భీష్మ ఏకాదశిని నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన గురువారం ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని విగ్రహాలకు నూతన రంగులు వేస్తున్నట్లు చెప్పారు. పెయింటింగ్ పనులు దాదాపు పూర్తి దశకు చేరుకున్నాయని, పెద్ద నంది విగ్రహానికి రంగులు వేయడం పూర్తైందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేపడతామన్నారు. క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి ఇంజినీరింగ్, పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అలరించిన హరికథ



హరికథాగానం వినిపిస్తున్న కళాకారిణి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన డి.లక్ష్మీ మహేష్ భాగవతారిణి వారిచే శివపార్వతుల కల్యాణంపై హరికథాగానం నిర్వహించారు. హార్మోనియం ఎం.ధనుంజయ, మృదంగ సహకారం ఎం.వెంకటేష్ అందించారు.



శివపార్వతుల విగ్రహాలు

ముస్తాబవుతున్న మహానంది



రంగులతో ఆకట్టుకుంటున్న నీలకంఠుడు



కొత్తగా కనిపిస్తున్న పార్వతీదేవి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది ఆలయం ముస్తాబవుతుంది. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలోని కోనేరుల ముందు ఉన్న పార్వతీ, పరమేశ్వరుల విగ్రహాలతో పాటు రాజగోపురం మండపంలోని శివపార్వతుల కుటుంబ పరివార విగ్రహం, అమ్మవారు, రాజగోపురంపై ఉన్న ఈశ్వరుడి దంపతుల విగ్రహాలకు నూతన రంగులు వేస్తున్నారు. ఇప్పటికే పెయింటింగ్ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. గురువారం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి క్షేత్ర ప్రాంగణంలో పర్యటించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. - మహానంది